క్లుప్తంగా

గ్రంథాలయ భవన నిర్మాణానికి సహకరించండి



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి సహకరించాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కోరారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెట్రిసెల్విని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర బాబు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ తదితరులు మంగళవారం ఆమె చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980వ సంవత్సరంలో నిర్మించిన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం పూర్తిగా శిథిలదశకు చేరిందన్నారు. నూతన భవన నిర్మాణానికి, గ్రంథాలయాన్ని తాత్కాలికంగా మరో చోటకి మార్చాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉన్న ఇతర సమస్యలను కూడా అడిగి తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్ వెట్రి సెల్వికి మొక్కను అందిస్తున్న వెంకటేశ్వరరావు

ఏలూరు(మెట్రో): జిల్లా అభివృద్ధికి సహకరించాలని, అన్ని రంగాల్లో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. కలెక్టర్‌ను దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ వంటిపల్లి వెంకటేశ్వరరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తానని ఆయన కలెక్టర్‌కు చెప్పారు.

శ్రేణులకు అండగా వైఎస్సార్ సీపీ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

దెందులూరు: గెలుపు ఓటములు రాజకీయాల్లో సహజమని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడ వద్దని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నేత ప్రసాద్ సూచించారు. సత్యవోలులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ గ్రామ కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మాట్లాడారు. పార్టీకి నాయకులు, కార్యకర్తలు చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పార్టీపరంగా ఎటువంటి సమస్యలు వచ్చినా తమను నేరుగా సంప్రదించాలని సూచించారు.

తూడు తొలగించండి

దెందులూరు: కృష్ణా, గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని ఆయుకట్టు రైతులు అధికారులను కోరుతున్నారు. సార్వా సాగు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్న తరుణంలో గోదావరి, కృష్ణా కాలువల నీరు ఆయుకట్టు దిగువున పూర్తిస్థాయిలో పారేందుకు గుర్రపుడెక్క అటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

- 11 అంశాలతో అజెండా
- పంపుల చెరువు వద్ద పెట్రోల్ బంక్ నిర్వహణకు చర్యలు



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశానికి అధికారులు నోటీస్ జారీ చేశారు. ఏలూరు కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం 10.30 గంటలకు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. సర్వసభ్య సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యుల ముందు ఉంచేందుకు 11 అంశలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. ఈ అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించనుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలి సమావేశం కావటంతో కౌన్సిల్‌లో సభ్యులు ఏవిధంగా వ్యవహరిస్తారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రతిపాదనలు ఇలా..

- ప్రధానంగా ఏలూరు నగర ప్రజలకు తాగునీటి వినియోగానికి సంబంధించి హెడ్ వాటర్ వర్క్స్, పంపింగ్ స్టేషన్ మరమతులు, నిర్వహణకు రూ.45.58 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు. ఏలూరు నగరం పరిసర ప్రాంతాల్లో నీటి వినియోగానికి సంబంధించి ఆయా ప్రాంతాల్లో బోర్లు పాడైపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి రిపేర్లకు రూ.35 లక్షలతో అంచనాలు రూపొందించారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి దీపాల నిర్వహణ, మరమ్మతులకు రూ.28.47 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు.
- ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కంటింజెన్సీ చార్జీల చెల్లింపులకు సంబంధించి ఈ ఏడాది మార్చి 6న కౌన్సిల్ తీర్మానం మేరకు మార్చి వరకు ఆమోదం పొందగా, 56 మంది స్వీపర్లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఒక్కొక్కరికీ నెలకు రూ.4 వేలు కంటింజెన్సీ చార్జీలు చెల్లించేలా కౌన్సిల్ అనుమతికి అజెండాలో ఉంచారు.
- ఏలూరు నుంచి పెదపాడు రోడ్డులో కార్పొరేషన్ వెహికల్ డిపో, హెడ్ వాటర్ వర్క్స్ మధ్య పంపుల చెరువు స్థలంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్‌కు సంబంధించి పెట్రోల్ బంకు డీలర్‌షిప్ తీసుకునేందుకు చేపట్టిన చర్యలపై కౌన్సిల్ అమోదానికి సమావేశంలో చర్చిస్తారు. 30 ఇంటూ 30 మీటర్ల విస్తీర్ణం స్థలంలో బీపీసీఎల్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయనున్నారు. స్థలం కేటాయింపులో ఎన్‌వోసీ సమర్పించాల్సి ఉండగా కౌన్సిల్ అనుమతికి అజెండాలో ఉంచారు. ఈ పెట్రోల్ బంకు డీలర్‌షిప్ కారణంగా నగరపాలక సంస్థకు ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రతి లీటర్ డీజిల్‌పై రూ.2.30లు, పెట్రోల్‌పై రూ.3.30లు కమిషన్ ఇస్తారని పేర్కొన్నారు. ఇదే తరహాలో రాష్ట్రంలో తాడిపత్రి, ప్రొద్దుటూరు తదితర పట్టణాల్లోనూ ఉన్నాయని తెలిపారు.

4న విద్యాసంస్థల బంద్



విద్యార్థి సంఘాల ఐక్యతను చాటుతున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జూలై 4న తలపెట్టే విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనీల్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ నిర్వహించిన నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న విద్యాసంస్థల బంద్‌కు పిలుపు ఇచ్చినట్టు చెప్పారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు అయోమయ పరిస్థితిలోకి వెళ్లిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పరీక్ష ప్రారంభించినప్పటి నుంచి అనేక అవకతవకలకు పాల్పడుతూనే ఉందని, ఇప్పుడు కూడా నీట్ పరీక్ష పేపర్ దాదాపుగా 30 లక్షలకు అమ్మేశానని ఒక వ్యక్తి అంటుంటే, మరి కొందరు కొనుగోలు చేశామని వాగ్మూలం ఇచ్చారని వివరించారు. అయినా ప్రధాని లేదా కేంద్ర విద్యా శాఖ మంత్రి లేదా ఎన్‌టీఏ లేదా పరీక్ష పేపర్ లీక్ చేసిన వ్యక్తుల పైనా చర్యలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించే విద్యాసంస్థల బంద్‌లో ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ అన్ని రకాల విద్యా సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గరికే అఖిల్, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై ఉద్దేశపూర్వకంగానే దాడి



ఆటో డ్రైవర్ రమేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కొవ్వలి గ్రామానికి చెందిన మాత్రపు రమేష్‌పై కొందరు ఆటో డ్రైవర్లు దాడి చేయడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. ఆటో యూనియన్ కొవ్వలి ప్రెసిడెంట్‌గా ఉన్న రమేష్‌పై సీరియల్ విషయంలో ఉద్దేశపూర్వకంగా వివాదాన్ని సృష్టించి, ఏలూరు టౌన్ ఆటో యూనియన్ ప్రోద్బలంతో దాడి చేశారని నాయకులు ఆరోపించారు. రమేష్‌పై దాదాపు 30 మంది డ్రైవర్లు దాడి చేశారని, తలకి గాయం కావడంతో ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గాయానికి రెండు కుట్లు వేశారని తెలిపారు. రమేష్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఏలూరు జిల్లా ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపిని టౌన్ యూనియన్‌కు చెందిన నగరబోయిన లీలా కృష్ణ తన అనుచరులతో దుర్భాషలాడుతూ దాడికి దిగినట్టు చెప్పారు. రమేష్, గోపిలపై దాడి చేసిన లీలా కృష్ణ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. రమేష్‌ను డీఎన్‌వీడీతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, ఏలూరు నగర నాయకులు పి.కిషోర్, వి.సాయి బాబు, ఆటో యూనియన్ నాయకులు చక్రాల అమర్ కుమార్ పరామర్శించారు.

ఏలూరు రోటరీ క్లబ్‌కు అవార్డులు



అవార్డులు అందుకున్న రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు రోటరీ క్లబ్ 2023–24 సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు అవార్డుల పంట పండింది. విజయవాడలో జరిగిన రోటరీ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో ఈ క్లబ్ 17 అవార్డులు కైవశం చేసుకుందని రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.దామోదర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు అధ్యక్షుడు రోహిత్‌కు బెస్ట్ ప్లాటినం అవార్డు లభించిందని పేర్కొన్నారు. ఈ క్లబ్ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వివరించారు. క్లబ్ అధ్యక్షుడిగా రోహిత్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో స్వామి త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరుకు 2023–24 సంవత్సరపు పదవీ కాలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి, అందరి మన్ననలు పొందిన క్లబ్ అధ్యక్షుడు రోహిత్, జాయింట్ సెక్రటరీ వెజ్జు నాగమణి ప్రియలను ప్రత్యేకంగా అభినందించారు.

అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



షాపు వద్ద రోడ్డుపైకి తెగిపడి వేలాడుతున్న వైర్లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో మంగళవారం స్థానికులు అప్రమత్తతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులోని షాపునకు సంబంధించిన ఫ్లెక్సీ విరిగిపోయి 11 కేవీ వైర్లపై పడింది. దీంతో భారీగా మంటలు వచ్చి 11 కేవీ వైర్లు తెగి రోడ్డుపై పడ్డాయి. ఇది గమనించిన చుట్టుపక్కల షాపుల యజమానులు అప్రమత్తమై ఆ రోడ్డు గుండా వాహనాలు వెళ్లకుండా మోటార్‌సైకిళ్లను అడ్డుగా పెట్టి రాకపోకలను అడ్డుకున్నారు. అలాగే ఘటనకు సంబంధించి సమాచారాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేశారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రధాన రహదారి కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఘటన జరిగిన సమయంలో జనసంచారం లేకపోవడం, వెంటనే స్థానికులు అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పలువురు చెప్పారు.

సీఆర్‌ఆర్ విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఆర్‌ఆర్ పీజీ విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలపూరి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. సీఆర్‌ఆర్ పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తదానం చేయడంలో సీఆర్‌ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ఎప్పుడూ ముందుంటారని, ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తారని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వర ప్రసాదరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలపురి ప్రెసిడెంట్ పీవీ రమణ, పీఆర్‌ఓ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం



దెందులూరులో పతాకాన్ని ఎగురవేసిన రమణయ్య

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని దెందులూరు మండలంలో సాల్వేషన్ ఆర్మీ చర్చిల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దెందులూరులో కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, కొవ్వలిలో కోర్ ఆఫీసర్ మేజర్ సుబ్బారావు సాల్వేషన్ ఆర్మీ పతాకాలను ఎగురవేశారు. వృద్ధులకు దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రిటైర్డ్ జనరల్‌కు సత్కారం

సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ జనరల్ బ్రియాన్ తెడ్లీని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చి స్థలదాత పల్లె యోహాన్ కుమారుడు, హ్యూమన్ రైట్స్ కమిషన్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ మంగళవారం జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో సత్కరించారు. దెందులూరు గౌడవీధిలో సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి తన తండ్రి స్థలం దానం చేశారని, చర్చి నిర్మాణ ప్రగతిని తెడ్లీకి హర్షవర్ధన్ వివరించారు.

వాహన నిబంధనలు పాటించడం తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సీఐ పి.రాజేష్ వాహనదారులకు సూచించారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనదారులకు జరిమానాలు విధించారు. అలాగే ఆయా వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహన నిబంధనలు రూపొందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి ఒక్క వాహనదారుడు పాటించాల్సిందే అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్‌కు వాహనాలు ఇవ్వడం ఇవన్నీ నేరాలే అన్నారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారికి జరిమానాలతో పాటు చట్టపరమైన శిక్షలు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలంటే నిబంధనలు పాటించాలని సూచించారు. ఒకరి అజాగ్రత్త అతని కుటుంబంతో పాటు, ప్రమాదాల పాలైన వారి కుటుంబాలను కూడా చిన్నాభిన్నం చేస్తుందని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ వాహన తనిఖీల్లో ఎస్సై జి.జ్యోతిబాస్, ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం



ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్

ద్వారకాతిరుమల: ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్ అన్నారు. భారత న్యాయ వ్యవస్థలో మూడు కొత్త నేర చట్టాలు అమలులోకి వచ్చాయని, గతంలో అమలులో ఉన్న భారత శిక్షాస్మృతి (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్పీసీ), భారత సాక్ష్యాధార చట్టాల చరిత్ర గతనెల 31 అర్ధరాత్రితో ముగిసిందన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)ను, సీఆర్పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)ను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ)ను చట్టాలుగా మార్చినట్టు చెప్పారు. కొత్త చట్టాల అమలుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పోలీసు సిబ్బంది శిక్షణ పూర్తి చేసుకున్నారని, కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు కూడా చేశారన్నారు. మారిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సతీష్ సూచించారు.

కొత్త చట్టాల్లో మారిన శిక్షలు ఇవీ..

- కొత్త చట్టాలతో జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులను ఆన్‌లైన్లో నమోదు చేయడం, ఎస్ఎంఎస్ వంటి ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో సమన్లు పంపడం, హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్లను తప్పనిసరిగా వీడియోల్లో బంధించడం వంటి ఆధునిక పద్ధతులు న్యాయ వ్యవస్థలో రానున్నాయి.
- భారతీయ శిక్షాస్మృతిలోని రాజద్రోహాన్ని ఇప్పుడు దేశద్రోహంగా మార్చారు. కులం, మతం వంటి కారణాలతో సామూహిక దాడులు, హత్యకు పాల్పడితే ఐపీసీ ప్రకారం ఏడేళ్ల వరకు శిక్ష పడేది. ఇప్పుడు దీన్ని యావజ్జీవంగా మార్చారు. హేయమైన నేరాలకు సంబంధించిన క్రైమ్ సీన్ల వీడియో చిత్రీకరణ తప్పనిసరి చేశారు.
- నకిలీ నోట్ల తయారీ, వాటి స్మగ్లింగ్ ఉగ్రవాదం పరిధిలోకి వస్తుంది. విదేశాల్లో మన ఆస్తులు ధ్వంసాన్ని ఉగ్రవాదంగా నిర్వచించారు. డిమాండ్ల సాధనకు వ్యక్తులను బంధించడం, కిడ్నాప్ చేయడాన్ని ఉగ్రవాదం పరిధిలోకి చేర్చారు.

అత్యాచారాలకు మరింత కఠిన శిక్షలు

మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని జోడించారు. పిల్లలను కొనడం, అమ్మడం ఘోరమైన నేరంగా మార్చారు. మైనర్‌పై సామూహిక అత్యాచారానికి మరణశిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన తెచ్చారు. పెళ్లి చేసుకుంటానన్న తప్పుడు వాగ్దానాలతో లైంగిక సంబంధాలు పెట్టుకుని మహిళలను వదిలేయడం వంటి కేసులకు కొత్త నిబంధన పెట్టారు. మహిళలు, పిల్లలపై నేరాల్లో బాధితులకు అన్ని ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స లేదా ఉచిత వైద్యం అందించాలి. మహిళలు, 15 ఏళ్ల లోపు, 60 ఏళ్లు పైబడిన వ్యక్తులు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇంటి నుంచే పోలీసు సాయం పొందవచ్చు. కోర్టు అనుమతి లేకుండా లైంగిక దాడి గురించి ప్రచురిస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు

ఫిర్యాదుల నుంచి సమన్లదాకా అన్నీ ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. పోలీసు స్టేషన్‌కు వెళ్లే పని లేకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎస్ఎంఎస్ ద్వారా కూడా సమన్లు పంపవచ్చు. పరిధితో సంబంధం లేకుండా ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఎఫ్ఐఆర్ దాఖలు చేసేలా జీరో ఎఫ్ఎఆర్ విధానాన్ని ప్రవేశపెట్టారు. అరెస్ట్ అయిన వ్యక్తి కుటుంబానికి, స్నేహితులకు సమాచారాన్ని పంపించుకునే వీలు కల్పించడంతోపాటు వివరాలను పోలీస్ స్టేషన్లలో ప్రదర్శిస్తారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21,.15	4822	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	--
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.10	98503	00
ఏలూరు – తిరుపతి	16.00	4830	18

డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



ప్రిన్సిపాల్ విజయ్‌బాబు

కామవరపుకోట: ఆడమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ బాబు మంగళవారం తెలిపారు. కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 2వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తేదీన దరఖాస్తుల పరిశీలన, 11 నుంచి 15వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ నమోదు, 19న సీట్ల కేటాయింపు, 20 నుంచి 22వ తేదీ వరకు సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయవలసి ఉంటుందని అన్నారు. జూలై 22న తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో చేరబోయే మహిళా విద్యార్థులకు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు కోరారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



లక్ష్మీపురంలో డయేరియా నివారణపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ పద్మావతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డయేరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల్లో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమం అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడంతో పాటు రెండు వారాల జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తారని చెప్పారు. కేఆర్‌పురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి మౌనిక మాట్లాడుతూ డయేరియా వంటి సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలుషితమైన నీరు, ఈగలు, దోమలు వాలిన ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలకు గురవుతారని చెప్పారు. ఎప్పటికప్పుడు చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలని అన్నారు. వంట పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలన్నారు. డయేరియాకు గురైన వారు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు వెళ్లి సకాలంలో వైద్యం పొందాలన్నారు. డయేరియా నివారణపై ఆగస్టు 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీడీపీఓలు ఈ.తులసి, రాజశేఖర్, స్వర్ణ కుమారి, సీహెచ్‌ఓ గంగాదేవి, హెచ్ఎస్ దేవరాజు, హెచ్‌వీ సరస్వతి, సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యావతి, ఏఎన్ఎం మంగతాయారు, అంగన్‌వాడీ వర్కర్లు అనితకుమారి, పుష్ప పాల్గొన్నారు.

పనిభద్రత కల్పించాలి

జంగారెడ్డిగూడెం: హమాలీలకు పని భద్రతతో ఉన్న సమగ్ర చట్టం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ కోరారు. స్థానిక గవర్నమెంట్ టింబర్ డిపో వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు.